# రేపటి పెళ్ళికూతురు



కె.బి. కృష్ణ

**హైటెక్ యుగం వచ్చినా పాత పద్ధతులు, పాత సాం(ప్రదాయాలు ఇంకా పోలేదు. పెళ్ళి చూపులు, పెళ్ళి సందడి, పెళ్ళిలో జరిగే తంతు, ఇలాంటివి ఇంకా కొనసాగుతూనే వున్నాయి సరదాల పేరుతో.**

అది ఒక పల్లెటూరు. ఆ ఊళ్ళో మోతుబరి రైతుగారి ఏకైక కుమార్తె పెళ్ళి చూపులు. ముందు హాలులో పల్లెటూరి ఆచారం (ప్రకారం, ఒక యాభై పైనే కుర్చీలు, ఆడవాళ్ళ కోసం చాపలు వేశారు. ఆ కుర్చీల నిండా పెద్ద మనుషులూ, చాపలనిండా పెద్దా, చిన్నా ముత్తయిదువులూ కూర్చుని వున్నారు.

మధ్యలో ఎదురెదురుగా రెండు కుర్చీలు, ఆ కుర్చీలపై తెల్లని గుడ్డలు పరిచి వున్నాయి. ఒక కుర్చీలో అబ్బాయి కూర్చుని వున్నాడు. అతని వెనుక అతని మిత్రులందరూ కూర్చుని వున్నారు. వాళ్ళు పగటివేషగాళ్ళలాగా ఒక్కొక్కళ్ళూ ఒక్కో పద్ధతిలో వస్త్రాలంకరణ చేసుకున్నారు. ఇంకో (ప్రక్కన పెళ్ళికొడుకు తల్లీతండ్రీ, వారి బంధువులు కూర్చున్నారు. హాలంతా సుగంధాల పరిమళంతో నిండి వుంది.

అబ్బాయి తండ్రి,

"అమ్మాయిని తీసుకురండి" అనాడు.

అమ్మాయి తండ్రి,

"అలాగేనండి" అన్నాడు.

ఇంతలో అబ్బాయి,

"చూడండి మీ అమ్మాయి అందచందాలు, పద్ధతులు, నడవడిక నాకు ఒక్కడికే నచ్చడం కాదు నా వెనుక ఉన్న నా స్నేహితులందరికీ నచ్చితేనే నేను చేసుకునేది. మీ అమ్మాయి వాళ్ళ (ప్రశ్నలకు కూడా సంతృప్తికరంగా జవాబు చెప్పాల్సి వుంటుంది. ఇది గుర్తుంచుకొని మీ అమ్మాయిని చూపించండి" అన్నాడు.

"బాబూ అమ్మాయిని పెళ్ళి చేసుకునేది, కాపురం చేసేదీ, మీరేనా" అన్నాడు మధ్యవర్తి.

"అవును నేనే. ఎందుకు వచ్చింది మీకా సందేహం?"

"లేదూ మీ స్నేహితులందరికీ నచ్చా

లంటున్నారు కదా! ఒకవేళ అమ్మాయి మీతో పాటు మీ స్నేహితులతో కూడా కాపురం చెయ్యాలేమోనని అనుమానం వచ్చిందిలెండి" అన్నాడతను చిరుకోపంతో.

వెంటనే అబ్బాయి తండ్రి కలగచేసుకుని,

"బావగారూ! మా వాడి మాటలు పట్టించుకోకండి. హైటెక్ పిల్లలు కదండీ.. లైట్‌గా తీసుకోండి" అన్నాడు. అక్కడ పెద్ద మనుషులూ, ఆడంగులూ ముక్కుల మీద వేళ్ళేసుకున్నారు.

"అలాగేనండీ" అంటూ ఆయన లోపలకు వెళ్ళాడు.

కొంచెం సేపటికి,

బాపూ బొమ్మకన్నా అందంగా, తెల్లగా, ఐదున్నరడుగుల ఎత్తులో, ఎత్తుకు తగ్గ అవయవ సౌందర్యంతో ఆకుపచ్చ, ఎరుపురంగు కలబోసిన పంజాబీ సూట్ వేసుకున్న అమ్మాయి వచ్చి, అబ్బాయి ఎదురుగా నిలబడింది.

హఠాత్తుగా,

"మిస్టర్ మీరేం చదువుకున్నారు?" అంది.

"యమ్ టెక్" ఠక్కున జవాబు చెప్పాడు. ఏమిటిది? నేను జవాబు చెప్పడం ఏమిటి? అని తరువాత అనుకున్నాడేమో,

"నేనేం చదువుకున్నానో తెలుసా?" అందామె వెంటనే.

"తెలుసు. యమ్ టెక్ అయితే ఏమిటి?" అన్నాడు. ఇప్పటికి తనకు ప్రశ్న వేయడానికి అవకాశం వచ్చిందని సంతోషపడుతూ.

అతను ఆమె అందచందాలకు కళ్ళప్పగించి చూస్తున్న సంగతి ఆమె గమనించింది.

అతని వెనుక వున్న స్నేహితులు అవాక్కయి తెరుచుకున్న నోళ్ళు తెరుచుకునే వుండిపోయిన సంగతి కూడా అప్పుడే గమనించింది.

"ఏయ్ మిస్టర్ నీకు నేను నచ్చి వుండవచ్చు. నీ స్నేహితులకు కూడా నచ్చి వుండవచ్చు. కానీ నువ్వు నాకు నచ్చలేదు కాబట్టి" అంటూ వీధి గుమ్మం వేపు తన కుడిచేతి చూపుడు వేలు చూపించి చకచకా లోపలకి వెళ్ళిపోయింది.

అందరూ నిర్ఘాంతపోయి చూస్తుండగానే పెళ్ళికొడుకు పరివారం లేచి వెళ్ళిపోయారు.

ఆమె నిన్నటి పెళ్ళికూతురు కాదు. హైటెక్ యువకులను అధిగమించిన రేపటి పెళ్ళికూతురు. ❋



